క్లుప్తంగా

అర్జీలకు తక్షణ పరిష్కారం



అర్జీదారులతో మాట్లాడుతున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మూడు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి పరిశీలించారు. రెవెన్యూ విభాగానికి 2, టౌన్ ప్లానింగ్ విభాగానికి 1 చొప్పున అర్జీలు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఆర్ఐ కాకర శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, పద్మావతి, డీఈ భరణికుమార్, పబ్లిక్ హెల్త్ ఇన్‌చార్జి ఏఎంహెచ్‌వో జనార్దనరావు, సూపరింటెండెట్లు వెంకటరమణ, రాజు, పీఆర్వో శేఖర్‌బాబు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సామాజిక సేవలోనే సంతృప్తి



వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: సామాజిక సేవను మించిన సంతృప్తి మరొకటి లేదని వాకర్స్ డిస్ట్రిక్ట్-101 ఆర్సీ-5 యు.శుభ అన్నారు. మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన క్లబ్ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా ఆమె ప్రసంగించారు. ప్రతి మహిళ జీవితంలో సుఖదుఃఖాలు సర్వసాధారణమని, వాటిని సమానంగా తీసుకుంటూ సామాజిక చైతన్యంలో కీలక పాత్ర వహించాలన్నారు. కుటుంబ, సమాజంలో మహిళల పాత్రను వివరించారు. ఈ సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు, టవళ్లు, పండ్లు, బిస్కెట్లు, రొట్టెలు, ఫ్రూటీలు అందించారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి కె.భానుమతి, జాయింట్ ట్రెజరర్ ఎం.ప్రమీలరావు, వనితా వాయిస్ ఎడిటర్ సిహెచ్.పద్మావతి, జాయింట్ సెక్రెటరీ రత్నకుమారి, జి.శిరీషలత, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఈశ్వరరావు కుటుంబానికి ఎంపీ పరామర్శ



మృతుడు ఈశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ శ్రీభరత్

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం గాంధీనగర్‌లో దసరా పండగ రోజున ఈదురు గాలులకు విద్యుత్ వైర్లు తెగిపడిన సంఘటనలో మృతిచెందిన టీ దుకాణ యజమాని, టీడీపీ కార్యకర్త బత్తిన ఈశ్వరరావు కుటుంబ సభ్యులను సోమవారం రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత నేతృత్వంలో విశాఖ ఎంపీ శ్రీభరత్ పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి సంతాపం తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏపీఈపీడీసీఎల్ కంచరపాలెం జోన్-2 ఈఈ బి.కె.నాయుడు ఏఈ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యు.కార్తీక్, జోనల్ అధికారులు, పార్టీ నాయకులు జి.సౌజన్య, వీరుబాబు, కె.అప్పారావు, ఎం.సుధ, బి.శ్రీకాంత్, వెంకటరమణ, సిహెచ్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పగలే వెలుగులు



మురళీనగర్ బృందావన్ పార్కు వద్ద పగలు వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

మురళీనగర్: మురళీనగర్ పరిసరాల్లోని పలు ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా.. కొన్ని ప్రాంతాల్లో పగలు కూడా వెలుగుతూ విద్యుత్ వృథాకు ఆనవాళ్లుగా మారుతున్నాయి. మురళీనగర్ బృందావన్ పార్కులో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు ఉదయం 9 గంటల వరకు వెలుగుతున్నాయి. వీటిని ఆపే వారు లేరు. దీని వల్ల విద్యుత్ వృథా అవుతోందని, నిర్దేశించిన సమయానికి వీధిలైట్లను ఆపాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

ఆహ్లాదం కనుమరుగు



పార్కులో కళతప్పిన లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహం

- కళావిహీనంగా శాంతిపురం లాల్ బహదూర్ శాస్త్రి పార్కు
- అభివృద్ధికి నోచుకోక పోవడంతో పార్కు వైపు చూడని స్థానికులు
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



శాంతిపురం లాల్ బహదూర్ శాస్త్రి పార్కులో రాళ్లు తేలిన పరిసరాలు



పచ్చదనం లేక బోసిపోయిన పార్కు



వాకింగ్ ట్రాక్‌లో తగలబెట్టిన వ్యర్థాలు

సీతంపేట: ఉద్యానవనమంటే చుట్టూ పచ్చని మొక్కలు.. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలి. కాసేపు కూర్చుంటే మానసిక ప్రశాంతతతో సేదతీరాలి. ఇలా నలుగురికీ ఆహ్లాదాన్ని పంచాల్సిన 26వ వార్డు శాంతిపురంలోని లాల్ బహదూర్ శాస్త్రి పార్కు నిర్వహణ లోపంతో కళావిహీనంగా తయారైంది. మొక్కలు లేక పచ్చదనం కనుమరుగైంది. రాళ్లే తేలిన పార్కు ఆవరణ రోత పుట్టిస్తోంది. విద్యుత్ వెలుగులు లేక చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా నిలుస్తోంది. ఆహ్లాదాన్ని పంచకపోయిన పర్వాలేదని.. ఈ పార్కు వల్ల కొత్త ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్కు నిర్వహణ గాలికి..

1984లో అప్పటి మేయర్ ఎస్.ఎస్.ఎన్.రెడ్డి శంకుస్థాపన చేసి లాల్ బహదూర్ శాస్త్రి పార్కును అభివృద్ధి చేశారు. పార్కు నిర్వహణ బాధ్యతను 2000 సంవత్సరం నుంచి గురజాడ యువజన సంక్షేమ సంఘం తీసుకుంది. సంఘ అధ్యక్షుడు గంగిరెడ్డి 2021 వరకు పార్కు నిర్వహణ బాధ్యతలు చూశారు. మొక్కలు నాటి, కూర్చోడానికి బెంచీలు, పిల్లల ఆటపరికరాలు అమర్చారు. మొక్కలకు నీటి సౌకర్యం, లైటింగ్, చుట్టూ ప్రహరీ కల్పించడంతో సందర్శకులతో కళకళలాడేది. 2021లో గురజాడ సంఘం పార్కు నిర్వహణ బాధ్యత నుంచి తప్పుకుంది. 2022లో స్థానికంగా ఏర్పాటైన మరో సంఘం పార్కు బాధ్యతలు తీసుకుంది. వీరికి ఎవరూ సహకరించక పోవడంతో పార్కు నిర్వహణను గాలికి వదిలేయడంతో పరిస్థితి అధ్వానంగా మారింది.

ఆకతాయిలకు అడ్డా

పచ్చదనం కనుమరుగై పరిసరాలు రోత పుట్టిస్తుండటంతో శాంతిపురం పార్కుకు జనం రావడం మానేశారు. ఇదే అదనుగా ఆకతాయిలు తమ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పార్కును మార్చుకున్నారు. చీకటి పడితే మందు, గంజాయి తాగుతూ అల్లరి చేస్తూ, గొడవలు పడుతూ చుట్టుపక్కల నివాసులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కాలనీ మధ్యలో ఉన్న ఒకే ఒక విశాలమైన పార్కును అందంగా అభివృద్ధి చేసి అందరికీ ఆహ్లాదాన్ని పంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్థానికుల విజ్ఞప్తి చేస్తున్నారు.



సత్యం జంక్షన్ వద్ద వాకింగ్ ట్రాక్‌లో తాగిపడేసిన మద్యం బాటిళ్లు

అధ్వానంగా గ్రీన్‌బెల్ట్ పార్కులు

హైవే వెంబడి ఉన్న గ్రీన్‌బెల్ట్ పార్కులు నిర్వహణ లోపంతో అధ్వానంగా తయారయ్యాయి. జీవీఎంసీ 25వ వార్డులోని సత్యం జంక్షన్ వద్ద గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు రూ.25 లక్షలతో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పార్కు అభివృద్ధి చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వహణ లేక పచ్చదనం మాయమైంది. విద్యుత్ లైట్లు లేకపోవడంతో చీకటి పడితే మందుబాబులు తిష్ట వేస్తున్నారు. పార్కులో బెంచీలపై కూర్చొని మద్యం తాగుతూ అల్లరి చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పచ్చదనం లేక, పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో వాకింగ్ ట్రాక్ కళావిహీనంగా మారింది. సంబంధిత అధికారులు దృష్టి సారించి పార్కులను అభివృద్ధి చేసి విద్యుత్ దీపాలు అమర్చాలని స్థానికులు కోరుతున్నారు.

శాంతిపురం పార్కును అభివృద్ధి చేయాలి

శాంతిపురంలో ఉన్న ఒకే ఒక్క పార్కు కళావిహీనంగా మారింది. జీవీఎంసీ పట్టించుకోక పోవడంతో పచ్చదనం కనుమరుగైంది. పార్కు పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. కాసేపు కూర్చుందామన్న పార్కులో పరిసరాలు బాగోలేవు. రాత్రి పూట ఆకతాయిల అల్లరి ఎక్కువగా ఉంటోంది. అధికారులు ఈ పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవాలి.

– కె.సుజాత, అక్కయ్యపాలెం

అధికారులు స్పందించాలి

గత ప్రభుత్వం గ్రీన్‌బెల్ట్‌లను వాకింగ్ ట్రాక్, సిమెంట్ బెంచీలు, ఓపెన్ జిమ్, గ్రీనరీతో ఎంతో అందంగా తీర్చిదిద్దింది. నిర్వహణ లేక ప్రస్తుతం ఈ పార్కులు కళతప్పాయి. విద్యుత్ దీపాలు లేక రాత్రి పూట మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. వారి వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి గ్రీన్‌బెల్ట్ పార్కుల అభివృద్ధి, విద్యుత్ దీపాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలి.

– సిహెచ్.రవణమ్మ, గణేష్‌నగర్

ఆదర్శవంతంగా జీవించాలి



జర్నలిస్ట్ శివకుమార్‌ను సత్కరిస్తున్న ఆచార్య బాల మోహన్‌దాస్. చిత్రంలో సీపీ శంఖబ్రత బాగ్చి

మురళీనగర్: ప్రతి వ్యక్తి ఆదర్శవంతంగా జీవించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. కేరళ కళా సమితిలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మనుజ్యోతి ఇంటర్నేషనల్ ఆధ్యాత్మిక వేత్త శ్రీమన్నారాయణ శ్రీలహరికృష్ణ రచించిన అమృత మంజరి అంకురం-2 ఆధ్యాత్మిక గ్రంథాన్ని సీపీ బాగ్చి, నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, విశ్వ హిందీ మాజీ విభాగాధిపతి ఎమ్మెస్ ఇక్బాల్, బాల వికాస్ ఫౌండేషన్ అధ్యక్షుడు నరవ ప్రకాష్‌లు ఆవిష్కరించారు. సీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో నాలుగు దశలుంటాయని, అందులోని చివరి దశ సన్యాసమన్నారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన జర్నలిస్ట్, రచయిత ఆర్.శివకుమార్‌కు మనుజ్యోతి రాష్ట్ర స్థాయి అభినందన సత్కార పురస్కారాన్ని అతిథుల చేతుల మీదుగా అందజేశారు. శివకుమార్ మాట్లాడుతూ సమాజంలో నిరంతర సమస్యలను వెలికితీయడం, ప్రజలను చైతన్యవంతం చేయడంలో తాను ముందుంటానన్నారు. రాష్ట్ర స్థాయి సత్కారం అందజేసిన నిర్వాహకులు ఎం.సుబ్రహ్మణ్యం, బి.ప్రసాద్, బి.జీవన్‌కుమార్, బి.రమేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'వరల్డ్ స్పేస్ వీక్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఇంజినీరింగ్ విభాగంలో స్టూడెంట్ సొసైటీ ఉర్విక్రుతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వరల్డ్ స్పేస్ వీక్‌పై విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించే విధంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 10వ తేదీన విభాగ విద్యార్థులకు క్రీడా పోటీలు, 11న మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఎంయూఎన్), 12న ఐడియాథాన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 13న పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్, 14 స్పేషియల్ టెక్నాలజీస్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై సదస్సు, విశిష్ట ప్రసంగాలు, వివిధ పోటీలలో విజేతలుగా నిలచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జగదీశ్వరరావు, విద్యార్థులు జి.ఆశిష్, డి.ఎస్.ఎస్ చంద్రవర్ధన్, ఆర్.రిష్, ఎ.సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలికల మరణం దారుణం



కేజీహెచ్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మహారాణిపేట: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో గిరిజన బాలికలు పచ్చకామెర్ల బారిన పడటం దురదృష్టకరమని, ఇద్దరు చనిపోవడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు చనిపోయినట్లు మంత్రి ప్రకటించలేదని, చనిపోయిన బాలికల కుటుంబాలకు రూ.10 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పిల్లల ఆరోగ్యం గురించి సోమవారం సీపీఐ నాయకులతో కలిసి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలన్నారు. బాత్ రూమ్స్, పరిసరాలు బాగోలేని కారణంగా పిల్లలు అస్వస్థతకు గురయ్యారని తెలుస్తోందన్నారు. ఆస్పత్రిలో చేరిన పిల్లల కుటుంబాలకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎ.విమల, ఎం.పైడిరాజు, కేజీహెచ్ ఏఐటీయూసీ నాయకులు జేడీ నాయుడు, కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, ఎస్.నాగభూషణం, సీఎస్ క్షేత్రపాల్, ఆర్.శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ప్రైవేటీకరణ అన్యాయం

కేజీహెచ్ వద్ద మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలను ప్రైవేటు వారికి అప్పగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం ఎవరి కోసం పని చేస్తుందో చెప్పాలన్నారు. ముందుగా సీఎం చంద్రబాబు తన మైండ్‌సెట్ మార్చుకోవాలని హితవు పలికారు. విద్యా వ్యవస్థను గాలికొదిలేస్తున్నారని, మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు ఇస్తున్నారని, ఇంకొన్నేళ్లు ఆయన సీఎంగా ఉంటే ప్రభుత్వమే ప్రైవేట్‌పరం అయిపోతుందని ఎద్దేవా చేశారు.

జాతీయ స్థాయి ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు అభినందనలు



డాక్టర్ కాలేషా బేగంను అభినందిస్తున్న ముస్లిం ప్రముఖులు

డాబాగార్డెన్స్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల ముంబైలో జరిగిన అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్(ఏఎంపీ) జ్యూరీ సమావేశంలో విశాఖ చినగదిలి జిల్లా పరిషత్ హైస్కూల్ మ్యాథ్స్ అసిస్టెంట్ డాక్టర్ కాలేషా బేగం ఉపాధ్యాయ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం ఆమెను హైదరాబాద్‌లో మకత్ ట్రస్ట్ చైర్మన్, సభ్యులు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. బాలికలకు విద్య, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు జాతీయ స్థాయిలో ఈ అవార్డు లభించింది. డాక్టర్ కాలేషా బేగం వృత్తిపరంగా ఉపాధ్యాయునిగా తన బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రవృత్తిపరంగా కూచిపూడి నృత్యంలో పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇస్తూ, అనేక మందిని జాతీయ స్థాయి నృత్య పోటీలకు రాష్ట్రం నుంచి పంపించారు. అనేక పతకాలు సాధించిపెట్టారు. డాక్టర్ బేగం నిర్వహిస్తున్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ ట్రస్ట్ ద్వారా కెరీర్ గైడెన్స్, ఆర్ట్ అండ్ కల్చర్‌లో మార్గదర్శిగా ఉంటూ అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

తాటిచెట్లపాలెం: ఇటీవల కేంద్ర ప్రభుత్వం పలు వస్తువులపై తగ్గించిన జీఎస్టీపై అవగాహన కల్పించేందుకు సోమవారం 45వ వార్డులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కంపా హనోకు, జీవీఎంసీ జోన్-5 కమిషనర్ బి.రాము, ఏపీడీ కె.పుణ్యవతి, మాజీ కార్పొరేటర్ పి.ముత్యాలనాయుడు, బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక, వార్డు కూటమి నాయకులు పాల్గొన్నారు.

గడువులోగా వినతులు పరిష్కరించాలి

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ ప్రజాదర్బార్‌కు వచ్చిన వినతులను పరిశీలించి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి తొమ్మిది వినతులను స్వీకరించారు. ఆయా వినతులను సంబంధిత అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ టీచర్లకు ఇంకా అందని వేతనాలు

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు నెల వేతనాలు ఇంతవరకు చెల్లించలేదు. జిల్లాలో 17 ఎయిడెడ్ పాఠశాలల్లో సుమారు 65 మంది వరకు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, వారంతా వేతనాల కోసం ఎదురు చూస్తున్నారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేడ్కర్ ఆందోళనన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎయిడెడ్ టీచర్ల వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజావసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్

విశాఖ సిటీ: ప్రజల అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. మాస్టర్‌ప్లాన్-2041పై సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాస్టర్‌ప్లాన్ రూపకల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. త్వరలోనే సమగ్రమైన మాస్టర్‌ప్లాన్‌ను తీసుకువస్తామన్నారు. సమావేశంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ముఖ్య ప్రణాళిక అధికారి శిల్ప, ఇతర విభాగ అధికారులు పాల్గొన్నారు.

పోషకాహారంతో గర్భిణులు, బాలింతలకు మేలు



మాట్లాడుతున్న సీడీపీవో నీలిమ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు వైఎస్సార్ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఐసీడీఎస్ విశాఖ అర్బన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సోమవారం 8వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన పోషకాహారం గురించి అధికారులు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కంపా హనోకు, అర్బన్ సీడీపీవో నీలిమ, బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక, సహాయక సీడీపీవో శ్రీలత, మద్దిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జె.టి.ఎస్.జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి బాధాకరం



సీజేఐ గవాయ్‌పై దాడిని ఖండిస్తున్న భీమ్‌సేన్ వార్ ప్రతినిధులు

మహారాణిపేట: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని భీమ్‌సేన వార్ నాయకులు తీవ్రంగా ఖండించారు. కంచరపాలెంలోని భీమ్‌సేన వార్ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఈ దాడిపై చర్చించారు. కేసు విచారణ జరుగుతుండగా సీజేఐపై ఓ న్యాయవాది దాడికి యత్నించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గుడివాడ అప్పారావు, కోశాధికారి బల్లంకి కనకరాజు, కుంచె మధు, ఎద్దు బాలకృష్ణ, జి.రవికుమార్, కృష్ణకుమారి, ఐజాక్, నాంచారయ్య, శంకర్, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వీఎంఆర్‌డీఏ పార్కుల తోటమాలీలు

మహారాణిపేట: వీఎంఆర్‌డీఏ పరిధిలోని వివిధ పార్కుల్లో పనిచేసిన తోటమాలిలను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వుడా వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పలువురు కార్మికులు పాల్గొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు, సీఐటీయూ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడుతూ తోటమాలిలను విధుల నుంచి తొలగించి ఏడాది పూర్తయినా.. నేటికీ తిరిగి పనిలోకి తీసుకోలేదని, నష్టపరిహారం కూడా చెల్లించలేదన్నారు. దీనిపై కార్మిక శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ కార్మికులు 30 ఏళ్లుగా వీఎంఆర్‌డీఏ పార్కుల్లో పనిచేస్తున్నారని, వారికి ఎటువంటి పరిహారాలు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని వెంకటరావు ప్రశ్నించారు. తక్షణం కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు సిహెచ్.రాంబాబు, దేవాడ నరసింగరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోగుల సహాయకుల సుభోజనానికి విరాళం



కేజీహెచ్ వద్ద రోగుల సహాయకులకు భోజనం వడ్డిస్తున్న దాత బాలసుబ్రహ్మణియన్

మహారాణిపేట: టచ్‌స్టోన్ చారిటీస్, హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో కేజీహెచ్‌లో 14 ఏళ్లుగా రోగుల సహాయకులకు మూడు పూటలా భోజనాలు, అల్పాహారం అందిస్తున్న విషయం తెలిసింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఇండో ఎంఐఎం ప్రైవేట్ లిమిటెడ్ ముఖ్య ఆర్థిక అధికారి బాలసుబ్రహ్మణియన్ ఒక ఏడాది పాటు రోగుల సహాయకులను సుభోజనం కోసం విరాళమిచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 14 వరకు ఉచిత అన్నదానం కోసం ఆర్థిక సాయం అందజేశారు. ప్రతి రోజు 400 మంది రోగుల సహాయకులకు సుభోజనం కింద భోజనం, అల్పాహారం అందజేస్తున్నారు. కేజీహెచ్‌లో రోగులకు భోజనాలు పెడుతున్న ప్రాంతాన్ని సోమవారం బాలసుబ్రహ్మణియన్ సందర్శించారు. రోగుల సహాయకులకు స్వయంగా భోజనం వడ్డించి వారితో మాట్లాడారు. 14 ఏళ్ల నుంచి సుభోజనం ద్వారా లక్షలాది మంది రోగుల సహాయకులు లబ్ధి పొందారన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ డాక్టర్ నిష్కించిన భక్తదాసకు సుబ్రహ్మణియన్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో విజయ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, రంగనాథ్ ఈ కార్యక్రమం నిర్వహించారు.